**ఏఐ డాక్టర్**

సౌదీ అరేబియాలో ప్రపంచంలోనే మొట్టమొదటి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డాక్టర్ క్లినిక్ ప్రారంభమైంది. చైనాలోని మెడికల్ టెక్నాలజీ సంస్థ సైనీ ఏఐ, సౌదీ ఆరోగ్య సంస్థ అల్మూసా హెల్త్ గ్రూప్ కలిసి ఈ ప్రయోగాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించాయి. అల్ అహ్సా ప్రాంతంలో ఈ ఏఐ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. డాక్టర్ హువా అనే ఏఐ ఆధారిత డాక్టర్ సేవలందిస్తుంది. ఉబ్బసం, గొంతునొప్పి వంటి 30 రకాల రోగాలను పరీక్షిస్తుంది.

nipuna
Every Wednesday Free Supplement
25 జూన్ 2025
పేజీలు 8

# నిబంధనలు సరళతరం - విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం

## ఆర్థిక సంస్కరణలు - ఫలితాలు

- ప్రభుత్వ నియంత్రిత ఆర్థిక వ్యవస్థను మార్కెట్ ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి తీసుకునే అనేక చర్యల సముదాయమే ఆర్థిక సంస్కరణలు. దేశంలో 1991, జూలై నుంచి అనుసరించిన నూతన ఆర్థిక విధానం ద్వారా పారిశ్రామిక విధానం, ద్రవ్యకోశ విధానాలు, విదేశీ వ్యాపార విధానాల్లో అనేక ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టారు.
- ఆర్థిక స్థిరీకరణ కోసం చర్యలు తీసుకోవడంతో పాటు సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు ప్రభుత్వం చేపట్టింది.

**1985 నాటి సంస్కరణలు**

- వాస్తవానికి 1991కి ముందే భారత ఆర్థిక విధానంలో కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అయితే 1991లో ప్రకటించిన నూతన ఆర్థిక విధానం ద్వారా ప్రవేశ పెట్టిన మౌలిక మార్పులు ఆర్థిక సంస్కరణలుగా అధిక ప్రచారంలోకి వచ్చాయి.
- 1985లో రాజీవ్ గాంధీ ప్రభుత్వంలో అల్ప స్థాయిలో ఆర్థిక సరళీకరణ ప్రక్రియ మొదలైంది. కొన్ని పరిశ్రమలను లైసెన్సుల పరిధి నుంచి తొలగించడం, లైసెన్సుల విస్తృత ఏకీకరణ వంటి చర్యలు తీసుకోవడం చేశారు. సిమెంట్ విక్రయంపై నియంత్రణ ఎత్తివేశారు. బహిరంగ మార్కెట్‌లో పంచదార కోటా పెంచారు. పెద్ద వ్యాపార సంస్థల ఆస్తుల పరిమితి రూ. 20 కోట్ల నుంచి రూ. 100 కోట్లకు పెంచారు. 94 పరిశ్రమలను మందుల లైసెన్సు పరిధి నుంచి తొలగించారు. 27 పరిశ్రమలు ఎంఆర్‌టీపీ చట్టం పరిధి నుంచి తొలగించారు. విదేశీ వ్యాపార విధానంలో నిబంధనలను సడలించి దిగుమతులను సులభతరం చేయడం, ఎగుమతి వస్తువుల ఉత్పత్తిని పెంచడానికి, ఆధునికీకరణకు ప్రోత్సాహం అందించారు. పరిపాలనకు సంబంధించిన నిబంధనలు సరళీకరించి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను, బహుళ జాతీయ సంస్థలను ఆకర్షించడానికి చర్యలు చేపట్టారు.
- 1985లో దీర్ఘకాలిక కోశ విధానాన్ని ప్రకటించారు. అయితే ఈ సంస్కరణలన్నీ ఆనాడు అమల్లో ఉన్న విధాన పరిమితికి లోబడి జరిగాయి. ఈ సంస్కరణలు అనుకున్న ఫలితాలు సాధించడంలో విఫలమయ్యాయి.

**1991 సంస్కరణల కంటే ముందు పరిస్థితి**

- 1956లో ఇండియా మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగంగా సామ్యవాద రీతికి ప్రాధాన్యం ఇచ్చి ప్రైవేట్ రంగంపై కఠిన నిబంధనలు, షరతులు విధించారు.

**ఉదా:** 1951- ఐడీఆర్ఏ (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్) చట్టం చేశారు. ఈ చట్టం ద్వారా పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం ప్రవేశ పెట్టారు.

- 1956 పారిశ్రామిక విధానం అనేక మౌలిక, కీలక పరిశ్రమలను ప్రభుత్వ రంగానికి రిజర్వ్ చేయడం
- ఎంఆర్‌టీపీ చట్టం ద్వారా భారీ ప్రైవేట్ కంపెనీలను నియంత్రించారు.
- పాలిత ధరల విధానాన్ని అనుసరిస్తూ ప్రైవేటు రంగం ఉత్పత్తి చేసే కొన్ని వస్తువుల ధరలను ప్రభుత్వమే నిర్ణయిస్తూ వచ్చింది.

**ఉదా:** సిమెంట్, పంచదార మొదలైనవి.

- అంతర్జాతీయ వ్యాపారంలో కొన్ని వస్తువుల దిగుమతులు అనుమతించలేదు. అధిక దిగుమతి సుంకాల ద్వారా కొన్ని వస్తువుల దిగుమతిని నిరుత్సాహపరిచారు. దిగుమతి ప్రత్యామ్నాయ విధానం అనుసరించారు. ఈ విధంగా స్వదేశీ పరిశ్రమలకు రక్షణ కల్పించారు.
- 1973లో అరబ్ దేశాలు, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం వల్ల ముడిచమురు ఉత్పత్తి చేసే దేశాలు ముడిచమురు వర్తకంపై ఆంక్షలు విధించాయి. 1979లో ఇరాన్ విప్లవం వల్ల ముడిచమురు దిగుమతి తగ్గి దిగుమతి వ్యయం పెరిగింది. దీనివల్ల వ్యాపార చెల్లింపుల శేషంపై ప్రతికూల ప్రభావం పడి కరెంట్ ఖాతాలో లోటు పెరిగింది.

**1991లో సంస్కరణలకు దారితీసిన పరిస్థితులు**

- 1990 నాటికి దేశంలో ప్రణాళికేతర వ్యయం పెరుగుతూ వచ్చింది. దానివల్ల స్థూల దేశీయ ఉత్పత్తిలో కోశ లోటు 7.8 శాతం చేరింది. కోశ లోటు పూడ్చుకోవడానికి ప్రభుత్వం రుణాల మీద ఆధారపడటం వల్ల రుణ భారం పెరుగుతూ వచ్చింది.
- దేశీయ ప్రభుత్వ రుణం స్థూల దేశీయ ఉత్పత్తిలో 49.7 శాతానికి చేరుకుంది. వడ్డీ చెల్లింపులు స్థూల దేశీయ ఉత్పత్తిలో 3.8 శాతానికి, కేంద్ర ప్రభుత్వం మొత్తంలో వ్యయంలో 22 శాతం, కేంద్ర ప్రభుత్వ మొత్తం రెవెన్యూ వ్యయంలో 39 శాతం చేరాయి. దేశం రుణాత్మక వలలో చిక్కుకునే పరిస్థితి ఏర్పడింది. గల్ఫ్ యుద్ధం వల్ల 1991, జనవరి నుంచి విదేశీ మారక ద్రవ్య నిల్వలు బాగా క్షీణించాయి. జూన్ నాటికి ఈ నిల్వలు 2 వారాల సరిపడా మాత్రమే ఉన్నాయి. మరోవైపు అధిక ద్రవ్యోల్బణ పరిస్థితి ఏర్పడింది.

**ఆర్థిక సంస్కరణలు**

- పైన వివరించిన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు 1991, జూలైలో పీవీ నరసింహారావు ప్రభుత్వం అప్పటి ఆర్థిక మంత్రి డా. మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో నూతన పారిశ్రామిక విధానం ద్వారా ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టింది. వ్యాపార చెల్లింపుల శేషంలో లోటు వల్ల ఏర్పడిన సంక్షోభం నుంచి బయటపడటానికి, విదేశీ మారక నిల్వల పరిస్థితి మెరుగుపడటానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి సహాయం కోరవలసి వచ్చింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి కొన్ని షరతులు విధించి రుణాన్ని మంజూరు చేసింది (2.3 బిలియన్ డాలర్లు).
- 1991, జూలై 24న నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి.
- 1991లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన ఆర్థిక విధానం లక్ష్యాలు

1) ఆర్థిక వృద్ధి రేటు పెంచడం
2) సంపూర్ణ ఉద్యోగిత సాధించడం
3) పేదరికపు జనాభా దిగువన ఉన్న జనాభా శాతాన్ని తగ్గించడం
4) పేద, ధనిక వర్గాల మధ్య ఆదాయ అసమానతలు తగ్గించడం
5) ఆర్థికాభివృద్ధిలో ప్రాంతీయ వ్యత్యాసాలు తగ్గించడం

- నూతన ఆర్థిక సంస్కరణల్లో భాగంగా భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలను స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి..



1) స్థూల ఆర్థిక స్థిరీకరణ
2) నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు

**స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు**

- ఇవి స్వల్పకాలిక చర్యలు. ఇవి డిమాండ్ నిర్వహణకు సంబంధించినవి. సమష్టి డిమాండ్ పెంచడానికి తోడ్పడేవి. వీటిని మూడు రకాలుగా పేర్కొనవచ్చు.

ఎ) **ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం:** ద్రవ్య సప్లయ్‌ని తగ్గించి ద్రవ్యోల్బణ రేటును తగ్గించడానికి ద్రవ్య విధానపరమైన చర్యలు తీసుకున్నారు.

బి) **కోశ లోటు సర్దుబాటు:** కోశలోటును 1990-91లో 8.4 శాతం నుంచి 1996-97లో 5 శాతానికి, 2006-07లో 3.7 శాతానికి తగ్గించే లక్ష్యంతో కొన్ని చర్యలు తీసుకున్నారు. పన్ను రాబడిని పెంచే చర్యలను సిఫారసు చేయడం కోసం 1991లో ప్రభుత్వం రాజా చెల్లయ్య కమిటీని నియమించింది. ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించేందుకు సిఫారసుల కోసం 2000లో గీతాకృష్ణ కమిషన్‌ను నియమించింది. కోశ లోటును తగ్గించడానికి 2003లో కోశ సంస్కరణలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడానికి చర్యలు తీసుకున్నాయి. సబ్సిడీలు తగ్గించడానికి ప్రయత్నించాయి. 2003లో కోశపరమైన బాధ్యత బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం యాక్ట్)ను ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం అన్ని రాష్ట్రాలు 2008-09 నాటికి పూర్తిగా రెవెన్యూ లోటును తొలగించాలి. కోశ లోటును 3 శాతానికి తగ్గించాలి. ఈ విధంగా తగ్గించిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రోత్సాహకాలు ఇస్తుంది.

సి) **వ్యాపార చెల్లింపుల శేషం లోటు సర్దుబాటు:** ఈ లోటును తగ్గించడం కోసం ప్రభుత్వం రెండు దఫాలుగా రూపాయి మూల్యహీనీకరణ చేసింది. 1991 జూలైలో రూపాయి విలువ 18-19 శాతం మధ్య తగ్గించింది.

**నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు**

- ఇవి దీర్ఘకాలికమైనవి. వ్యవస్థాపరమైనవి లేదా ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి సంబంధించినవి. సప్లయ్ నిర్వహణకు సంబంధించినవి. సరళీకరణ, ప్రైవేటీకరణ ఈ విధానంలోని భాగాలు.

1. **సరళీకరణం** (Liberalization): ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించి ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తూ నియమ నిబంధనలను సరళతరం చేయడమే సరళీకరణం. దీనిలో భాగంగా 1991, జూలైలో నూతన పారిశ్రామిక విధానం ప్రవేశ పెట్టారు.

- మొదటగా 18 పరిశ్రమలు మినహా మిగతా పరిశ్రమలకు లైసెన్స్ అవసరం ఎత్తివేశారు. ఆ తర్వాత దశల వారీగా పరిశ్రమ లైసెన్స్ తగ్గించారు. ప్రస్తుతానికి 4 పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి.
- 1991- 18, 1993- 15, 1998- 8, 1999- 6, 2006- 5, 2020- 4 దశల వారీగా తగ్గింపు.

1) ప్రమాద రసాయనాలు
2) పారిశ్రామిక పేలుడు పదార్థాలు
3) సిగార్, సిగరేట్ తదితర పొగాకు ఉత్పత్తులు
4) రక్షణ రంగం

- ఎంఆర్‌టీపీ చట్టంతో పెట్టుబడి పరిమితి ఎత్తివేసింది. 2002లో ఈ చట్టం స్థానంలో కాంపిటీషన్ యాక్ట్ (పోటీ చట్టం)ను ప్రవేశ పెట్టారు.
- విదేశీ మారక ద్రవ్యానికి సంబంధించిన నిబంధనలను సరళతరం చేస్తూ విదేశీ మారక ద్రవ్య క్రమబద్ధీకరణ చట్టం (ఎఫ్ఈఆర్ఏ) స్థానంలో విదేశీమారక ద్రవ్య నిర్వహణ చట్టాన్ని (ఎఫ్ఈఎంఏ) ప్రవేశ పెట్టారు.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతించారు. విదేశీ సంస్థాగత పెట్టుబడులను ఆహ్వానించారు.
- నరసింహం కమిటీ సిఫారసుల ప్రకారం బ్యాంకింగ్ సంస్కరణలు, విత్త సంస్కరణలు అమలు చేశారు.

2. **ప్రైవేటీకరణ** (Privatization): 1956 పారిశ్రామిక తీర్మానంలో ప్రభుత్వ రంగంలో 17 రకాల పరిశ్రమలు గుత్తాధిపత్యంలో ఉండేవి. 1991 నుంచి దశల వారీగా వీటి సంఖ్య తగ్గింది. ప్రస్తుతం రెండు పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి.

1) రైల్వే రవాణా
2) అణు విద్యుత్ ఉత్పత్తి

- (1991లో 8, 1993లో 6, 1994లో 4, 2001 3, 2020 నాటికి 2 పరిశ్రమలకు తగ్గించారు)
- నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడులను కొంత వరకు ఉపసంహరించడానికి పెట్టుబడుల ఉపసంహరణ విధానం ఆమోదించారు.

3. **ప్రపంచీకరణ** (Globalization): ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య వస్తు సేవలు, మూలధనం, సాంకేతిక విజ్ఞానం, శ్రామికులు ఎటువంటి అవరోధాలు లేకుండా స్వేచ్ఛగా బదిలీ అవడానికి వీలు కల్పించే విధానమే ప్రపంచీకరణ. దీనివల్ల మార్కెట్ విస్తరణ, వస్తు నాణ్యతలో మెరుగుదల, వ్యయం తగ్గుదల మొదలైన ప్రయోజనాలు కలుగుతాయి. ఈ విధానంలో భాగంగా భారత ప్రభుత్వం కింది చర్యలు తీసుకుంది.

1) 1991లో రెండు దఫాలుగా రూపాయి మూల్యహీనీకరణ చేశారు.
2) కొన్ని రంగాల్లోకి ఒక పరిమితికి లోబడి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను, విదేశీ సంస్థాగత పెట్టుబడులను అనుమతించారు.

### ఆర్థిక సంస్కరణలు - ఫలితాలు

1) 1990-91కి పూర్వం 5 శాతం సమీపంలో ఉన్న ఆర్థిక వృద్ధి రేటు సంస్కరణల అమలు వల్ల 7-8 శాతానికి పెరిగింది.
2) పేదరికం తగ్గుముఖం పట్టింది. 1993లో 36 శాతం నుంచి 2004-05 నాటికి 27.5 శాతానికి తగ్గింది. కానీ స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదలతో పోలిస్తే పేదరికం తగ్గుదల రేటు తక్కువ.
3) 1990కి పూర్వం ఉద్యోగిత వార్షిక వృద్ధి రేటు 3.4 శాతం కాగా 1990-91 నుంచి 1997-98 మధ్య కాలంలో ఒక శాతం తగ్గింది. సంస్కరణల కాలంలో నిరుద్యోగిత పెరిగింది. ఉపాధి లేని ఆర్థిక వృద్ధిగా దీన్ని ఆర్థిక నిపుణులు వర్ణించారు.
4) వ్యవసాయ రంగం లో పెట్టుబడి పెద్దగా పెరగలేదు. అవస్థాపన మీద ముఖ్యంగా నీటిపారుదల మీద ప్రభుత్వ పెట్టుబడి చాలా తక్కువ.
5) పారిశ్రామిక ఉత్పత్తి సూచీ తగ్గుముఖం పట్టింది. సంస్కరణలకు ముందు 7.8 శాతం ఉన్న సూచీ 2014-15 నాటికి 5.8 శాతానికి పడిపోయింది. విద్యుత్ రంగానికి సంబంధించిన ఉత్పత్తి సూచీ 9 శాతం నుంచి 6 శాతానికి పడిపోయింది.
6) ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు మెరుగుపడింది. ఈ సంస్థల స్థూల లాభాలు 1993-94లో 11.61 శాతం నుంచి 2004-05 నాటికి 21.5 శాతానికి పెరిగాయి. నికర లాభం 2.84 శాతం నుంచి 12.1 శాతానికి పెరిగింది.
7) ధరల సూచీలు పెరిగాయి.
8) అవస్థాపన పరిశ్రమల ఉత్పత్తి సూచీ సంస్కరణలకు ముందు 8 శాతం నుంచి 2014-15లో 5.9 శాతానికి పడిపోయింది.
9) సంస్కరణల అమలు ఫలితంగా 2001-02, 2002-03లో వ్యాపార చెల్లింపుల శేషంలో మిగులు ఏర్పడింది. కానీ ఆ తరువాత మళ్లీ లోటుగా మారింది.
10) సంస్కరణల కాలంలో దేశంలో విదేశీ పెట్టుబడి పెరిగింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎక్కువగా పెరిగాయి.
11) ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. రాష్ట్రాల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి.
12) ఆర్థిక సంస్కరణల్లో ప్రైవేటీకరణకు లభించిన ప్రాధాన్యం వల్ల సాంఘిక ఆర్థిక లక్ష్యాలు నెరవేరలేదు. ఆదాయ వ్యత్యాసాలు తీవ్రంగా పెరిగాయి.

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఎకానమీ

పన్నాల శ్రవణ్ కుమార్
ఎకానమీ ఫ్యాకల్టీ
హైదరాబాద్
9866709280

